ఇబ్రహీంబాగ్‌లో అభివృద్ధి పనులు చేపడుతాం

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ ఇబ్రహీంబాగ్‌లో అభివృద్ధి పనులను చేపడుతామని ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శనివారం ఇబ్రహీంబాగ్ బస్తీ వాసులు ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌ను కలిసి పలు సమస్యలపై ఫిర్యాదులు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే జీహెచ్ఎంసీ,విద్యుత్ శాఖల అధికారులతో మాట్లాడి అభివృద్ధి పనులను చేపడుతామని తెలిపారు. –మెహిదీపట్నం అక్టోబర్ 19

సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజల సమస్యలు పరిష్కరించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నామని నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. శనివారం మల్లేపల్లి,మెహిదీపట్నం,ఆసిఫ్‌నగర్ డివిజన్ల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి బస్తీలలో ఉన్న సమస్యలపై ఫిర్యాదులు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజలకు అభివృద్ధిని అందించడానికి అధికారులను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.

–మెహిదీపట్నం అక్టోబర్ 19

సీవరేజీ సమస్యలు పరిష్కరించాలి

వాటర్ వర్క్స్ఎండీ అశోక్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్, అక్టోబర్ 19: గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సీవరేజీ, కలుషిత నీటి సరఫరా, క్యాచ్‌పిట్‌ల నిర్మించాలని వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డిని శనివారం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ కలిసి కోరారు. ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా జరుగుతుండగా, కొన్ని ప్రాంతాల్లో క్యాచ్‌పిట్‌లు విరిగిపోయాయని, అంతే కాకుండా సీవరేజీ సమస్యలు, లో ప్రెషర్‌తో నీటి సరఫరా వంటి సమస్యలతో ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్ స్థాయి అధికారులను ఆదేశించి నియోజకవర్గంలోని అన్ని సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని కోరగా ఎండీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మనోహర్ గైక్వాడ్, ప్రదీప్, మహ్మద్ అహ్మద్, మహ్మద్ గౌస్, షబానా బేగం పాల్గొన్నారు.

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి రూ. 2.13 లక్షల నష్టపరిహారం

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు మీనా రామనాథన్, వీవీ.శేషబాబు సభ్యుల సమక్షంలో చేపట్టిన విచారణ అనంతరం రూ. 2.13 లక్షలు బాధితుడికి చెల్లించాలని తీర్పు వెల్లడించారు. ఎల్వీ ప్రసాద్‌లో కంటి పరీక్షల నిమిత్తం వీల్ కుర్చీలో తీసుకెళుతున్న సమయంలో సిబ్బంది కుర్చీని పడేయడంతో కరీంనగర్‌కు చెందిన మైన నారాయణ కాలు ఎముక విరిగిపోయింది. వెంటనే బాధితుడు సన్‌షైన్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. చికిత్సకు రూ. 1,48,631 వైద్య ఖర్చులు అయినట్టు ఫోరంకు దాఖలు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఉద్యోగుల తప్పిదం వల్లే బాధితుడికి అధిక ఖర్చులతో పాటు ఎముక విరిగి శస్త్ర చికిత్సకు దారితీసిందని ఫోరం నిర్ధారణకు వచ్చింది. 2015లో బాధితుడికి జరిగిన ప్రమాదం వల్ల తీవ్ర నష్టం జరిగినట్టు ఫిర్యాదుదారుడు ఫోరంను ఆశ్రయించారు.

జీవో 29ని తక్షణమే రద్దుచేయాలి

కాచిగూడ,అక్టోబర్ 19: గ్రూప్–1 అభ్యర్థుల రిజర్వేషన్లకు ఇబ్బందికరంగా ఉన్న జీవో 29ని తక్షణమే రద్దుచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యురాలు డాక్టర్ అనూహ్యారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఒంటెద్దు పోకడల కారణంగా గ్రూప్–1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయని మండిపడ్డారు. గ్రూప్–1 అభ్యర్థులకు అనుకూలంగా ఉన్న 55 జీవోను ప్రభుత్వం అమలుచేయాలని కోరారు. జీవో 29 వల్ల లక్షలాది మంది విద్యార్థులు గ్రూప్–1 చదవలేని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం పట్టింపు, మొద్దునిద్ర వీడకపోతే లక్షలాది మంది విద్యార్థులతో మరో తెలంగాణ ఉద్యమం తయారవుతుందని ఆమె హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనతో ప్రజలు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీల హక్కుల కోసం కేంద్రంపై పోరాడాలి

మాట్లాడుతున్న జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ,అక్టోబర్ 19: బీసీల హక్కుల కోసం ప్రతి బీసీ బిడ్డ కేంద్ర ప్రభుత్వంపై ఐక్యంగా పోరాడినప్పుడే విజయం సాధిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పిలుపునిచ్చారు.శనివారం కాచిగూడ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 56 శాతం బీసీలు ఉన్నారని, బీసీల హక్కుల కోసం ఉమ్మడిగా పోరాడినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతియేటా 2 కోట్ల ఉద్యోగ నియామకాలను చేపట్టి, నిజాయితీని నిరూపించుకోవాలని సూచించారు. కులగణన అంశంపై ఇప్పటికే ఏడు రాష్ట్రాలు అసెంబ్లీలో తీర్మానం చేశాయని, కేంద్రం కులగణన చేయకపోతే దేశ వ్యాప్తంగా బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో కులగణన చేయాలని కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి త్వరలో వేలాది మందితో దేశ వ్యాప్తంగా ఉద్యమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విద్యా ఉద్యోగాలపై ఉన్న క్రీమిలేయర్ నిబంధన వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. నీలం వెంకటేశ్, పాల్గొన్నారు.

మైసూర్ రైల్లో దొంగతనం

కాచిగూడ,అక్టోబర్ 19: మైసూర్ రైల్లో ప్రయాణికుడి ఖరీదైన ల్యాప్‌ట్యాప్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం .. మలక్‌పేటలోని సలీంనగర్ ప్రాంతానికి చెందిన ఖాసీం ఫిరోజ్ కుమారుడు అన్వర్‌పాషా బెంగళూర్ నుంచి మైసూర్ రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్య ఫలక్‌నామ రైల్వేస్టేషన్‌లో కదులుతున్న రైలు దిగుతుండగా సూట్‌కేసు పడిపోయింది. తరువాత స్టేషన్‌లో దిగి మళ్లీ వచ్చే వరకు సూట్‌కేసు, అందులో ఉన్న ఖరీదైన ల్యాప్‌ట్యాప్‌ను దొంగిలించుకుని పారిపో యారు. శనివారం అన్వర్‌పాషా కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మాణాచారి తెలి పారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులతో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి

అంబర్‌పేట, అక్టోబర్ 19: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, ఆ దిశగా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి సూచించారు. ఏదైనా ఆటల పోటీల్లో బహుమతులు సాధించడం ముఖ్యం కాదని, వాటిల్లో పాల్గొనడమే ప్రధానమని అన్నారు. బాగ్‌అంబర్‌పేట, డీడీ కాలనీకి చెందిన అకడమిక్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 78 మంది ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి క్రీడా, అకడమిక్ పోటీల్లో పాల్గొని బహుమతులను సాధించారు. బ్యాడ్మింటన్ ప్లేయర్ పద్మశ్రీ సైనా నేహాల్ విద్యార్థులకు ఢిల్లీలో బహుమతులను అందజేశారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో బహుమతులను సాధించిన విద్యార్థులను అభినందించారు. అకడమిక్ హైట్స్ పబ్లిక్‌స్కూల్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తు వారిని అన్ని రంగాలలో తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. పాఠశాల రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి, అడిషనల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ పాల్గొన్నారు.

మల్లికార్జుననగర్‌లో కార్పొరేటర్ పర్యటన

డ్రైనేజీ సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

అంబర్‌పేట, అక్టోబర్ 19: బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి శనివారం డివిజన్‌లోని మల్లికార్జుననగర్‌లో పర్యటించారు. బస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి సంబంధిత వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించారు. రెండు విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజల సమస్యను పరిష్కరించాలన్నారు. వాటర్‌వర్క్స్ మేనేజర్ మాజిద్, సూపర్‌వైజర్ లక్ష్మణ్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న ఆర్.కృష్ణయ్య, రాజేందర్,తదితరులు

మెహిదీపట్నం అక్టోబర్ 19: స్కాలర్ షిప్‌లను పెంచాలని, రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ బీసీ విద్యార్థులు శనివారం మాసాబ్‌ట్యాంక్‌లోని తెలుగు సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను పెంచాలని డిమాండ్ చేశారు.అంతే కాకుండా రూ. 4 వేల కోట్ల ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేసి చెల్లించాలన్నారు. పెరిగిన ధరల ప్రకారం ఎస్సీ,ఎస్టీ,బీసీ కాలేజీ విద్యార్థులకు మెస్ చార్జీలను రూ.1500 నుంచి 3 వేల వరకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, బీసీ , నాయకులు రాజేందర్, నీల వెంకటేశ్, నందా గోపాల్, అనంతయ్య, ఉదయ్, మహేశ్, శివ, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

అబిడ్స్, అక్టోబర్ 19: వాటర్ వర్క్స్ కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, అదే విధంగా ఏఎంఎస్ సెక్షన్ టెండర్‌ను పొడిగించకుండా రద్దు చేయాలని తెలంగాణ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి సెక్రటరీ పాల్కం శ్రీనివాస్ జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కోరారు. ఈ మేరకు కార్యాలయంలో శనివారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. కాంట్రాక్టర్‌ల బిల్లులను తక్షణమే విడుదల చేయక పోతే ఆమరణ నిరాహార దీక్ష చేయడానికి వెనకాడేది లేదన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు ఇర్ఫాన్, ఇమ్రాన్, ప్రవీణ్‌కుమార్, విక్రమ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్ ఇలంబర్తికి మొక్కను అందజేస్తున్న సహకార్ మజ్దూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్

అబిడ్స్, అక్టోబర్ 19: జీహెచ్ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ కోరారు. జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ ఇలంబర్తిని కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ ఆరోగ్య కార్డులు, బదిలీలు తదితర అంశాలపై కమిషనర్‌తో చర్చించినట్లు తెలిపారు. అన్నింటికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు మోజెస్, అనుబంధ ప్రధాన కార్యదర్శి శివకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి పీఎస్ ఉమేశ్ బాబు, నాయకులు మహ్మద్ రఫీక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇండ్లు కూల్చడం సరికాదు

మూసీ పరీవాహక ప్రాంతంలో మాట్లాడుదున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కార్వాన్, అక్టోబర్19: సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పేద ప్రజలకు తీవ్ర సమస్యలు సృష్టిస్తుందని సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇండ్లు కూల్చుతూ చేస్తున్న విధ్వంసకాండకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మూసీ పరీవాహక ప్రాంతంలోని ఇండ్లను కూలుస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆయన శనివారం కార్వాన్ నియోజకవర్గం పరిధిలోని రాందేవ్ గుడా, డిఫెన్స్ కాలనీ, కార్వాన్ దరియాబాగ్, జియాగుడాలలోని మూసీ ప్రాంత ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు తమ చెమట కష్టంతో ఒక్కో ఇటుక పేర్చి తమ కష్టార్జితంతో 30 ఏండ్ల కిందట ఇండ్లు నిర్మించుకున్నారని ఈ ఇండ్లకు ప్రభుత్వమే విద్యుత్, నల్లా కనెక్షన్‌లతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డులు అందజేయడంతో పాటే వీరి నుంచి ప్రతి ఏడాది ఆస్తి పన్ను కూడా వసూలు చేస్తున్న సంగతి ఆయన గుర్తు చేశారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు ఇవ్వడంతో పాటు వారి నుంచి ట్యాక్స్ వసూలు చేసిన ప్రభుత్వం ఇపుడు అకస్మాత్తుగా వచ్చి ఇండ్లు కూలుస్తామంటే ఇదెక్కడి అన్యాయమన్నారు. ఆయన వెంట గోల్కొండ తహసీల్దార్ అహల్య, జియాగుడా కార్పొరేటర్ బోయిని దర్శన్, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉప్కెల పాండు యాదవ్‌తో పాటు అమర్ సింగ్, బంగారి ప్రకాశ్, బండారు రాధిక, కట్లా అశోక్, రఘునాథ్ పాల్గొన్నారు.

ఇండ్లను కూల్చేస్తే ఊరుకోం..

మెహిదీపట్నం: మూసీ అభివృద్ధి పేరిట పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం మంచి పద్ధతి కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళన ,అభివృద్ధి కోసం లంగర్‌హౌస్ డివిజన్ రాందేవ్‌గూడ,రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాలలో కూల్చడం కోసం మార్కింగ్ చేసిన ఇండ్ల ప్రాంతాలను శనివారం కిషన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు కిషన్‌రెడ్డికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనికి స్పందించిన కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వతీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండు యాదవ్, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి,కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వినతి



స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను సన్మానించిన టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్

సుల్తాన్‌బజార్,అక్టోబర్ 19. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను వారు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా,పుష్పగుచ్ఛంతో సన్మానించి ఉద్యోగుల సమస్యలను విన్నవించారు. దీర్ఘకాలపు సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు.ఈ విషయమై స్పీకర్ గడ్డం ప్రసాద్ సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగుల అన్ని సమస్యలను రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్,తెలంగాణ నాల్గో తరగతి కేంద్ర సం ఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

రవీంద్రభారతి,అక్టోబర్ 19: కూచిపూడి నాట్యగురువు రవి శిష్యురాలు రితిక కంబలదిన్నె కూచిపూడి నృత్య శిక్షణ పొంది శనివారం రవీంద్రభారతిలో కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి హౌరా అనిపించింది. రితిక కంబలదిన్నె కూ చిపూడి అరంగేట్రం ప్రేక్షకులను కట్టి పడేసింది. చక్కని అభిన యం..కూ చిపూడి నాట్యాంశాలను పదర్శిం చారు.రితిక రవి కూచిపూడి నృత్యాల యంలో రవి శిష్యురాలిగా చేరి నాట్యగురువుల మధ్య ఎంతో వైభవంగా కూచిపూడి అరంగేట్రం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాట్యగురువు శ్రీవేదాంతం నరసింహశాస్త్రీ, గురు డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం, సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి రితిక కంబలదిన్నె కూచిపూడి రంగప్రవేశాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వక్తలు రితికను ఆశీర్వదించారు.వక్తలు మాట్లాడుతూ లలిత కళలు పూర్వీకులు ప్రసాదించిన మన దేశ సంపదని, లలిత కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత నాట్యగురువులపై ఉందన్నారు.మొట్టమొదటగా విగ్నేశ్వరుని స్తుతిస్తూ ప్రదర్శించిన కృతి శివస్తుతి , కంజదళాయతాకి అంటూ అమ్మవారిని కీర్తిస్తూ ప్రదర్శించిన నృత్యాంశాలు మంత్రముగ్ధులను చేసింది.

మండల స్వామికి నివాళి

రవీంద్రభారతి,అక్టోబర్ 19:మండల స్వామి మరణంతో తెలుగు సాహిత్యానికి తీరని లోటని తెలంగాణ సాహిత్య కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి అన్నారు. తెలుగు సాహిత్యంలో మండల స్వామి కృషి మరువలేనిదని అన్నారు.సాహిత్యమే శ్వాస,ధ్యాసగా బతికిన మనిషిగా మండల స్వామిని పేర్కొంటూ పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం డా.నామోజు బాలాచారి మండల స్వామి మరణానికి నివాళులర్పిస్తూ తెలంగాణ సాహిత్య అకాడమీ తరపున వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్ ,తిరుపాల్,సుదర్శన్ పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డుకు ఎంపిక

ప్రభాకర్ రావు

అబిడ్స్, అక్టోబర్ 19: గౌలిపురా జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్, విద్యావేత్త ప్రభాకర్‌రావును మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ పురస్కార్ 2024కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. ఈ నెల 22 మంగళవారం అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో మహాత్మాగాంధీ జయంతి, అంతర్జాతీయ శాంతి దినోత్సవ ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే సమావేశంలో ఆయనకు అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవానికి తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బండ ప్రకాశ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి చంద్రకుమార్, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి డీఎల్ పాండు పాల్గొంటారని తెలిపారు.



ఎట్టయ్య

సుల్తాన్‌బజార్. ప్రముఖ హైకోర్టు న్యాయవాది సంఘ సేవకుడు గద్దగూటి ఎట్టయ్యకు మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు 2024కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ శనివారం తెలిపారు. 15 సంవ త్సరాలుగా పర్యావరణ పరిరక్షణ,శాంతి, మతసామరస్యం,జాతీయ సమైఖ్యత,ఉచిత న్యాయ శిబిరాలను నిర్విరామంగా నిర్వహిస్తున్న న్యాయవాది ఎట్టయ్యను ఈ ఏడాది అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈనెల 22న బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియం లో ఈ అవార్డు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

ఆరోగ్యంపై అవగాహన

కార్వాన్, అక్టోబర్19 : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యం పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా గోల్కొండ ప్రాజెక్టు అధికారిణి మహిళలనుద్దేశించి మాట్లాడారు.

వివాహ పరిచయ వేదికను వినియోగించుకోవాలి

కాచిగూడ,అక్టోబర్ 19: ఉచిత వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి విజ్ఞప్తి చేశారు. శనివారం విశ్వకర్మ ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ యువతీ యువకుల కోసం ఈ నెల 20న నగరంలోని ముసాపేట పినాకిల్ హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి 7.30 వరకు వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతి, యువకులు ఈ వివాహ పరిచయ వేదికలో పాల్గొని వివాహ సంబంధాలు పెంపొందించుకోవాలని సూచించారు. వివరాల కోసం 9848199744, 9491888266లో సంప్రదించవచ్చని రవీంద్రాచారి విజ్ఞప్తి చేశారు.

నూతన చట్టాలపై అవగాహన

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : కొత్త చట్టాలపై న్యాయవాదులకు అవగాహన పెంపొందించేందుకు నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సెమినార్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ జ్యోతిని వెలిగించి సెమినార్‌ను ప్రారంభించి.. మాట్లాడుతూ.. చట్టాల గురించి సవివరంగా తెలుసుకునేందుకు ఈ సెమినార్ ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)పై చెన్నై హైకోర్టుకు చెందిన న్యాయవాది చంద్రశేఖరన్ చంద్రూ.. నాంపల్లి కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులకు సవివరంగా వివరించారు. నూతన చట్టాలపై క్రిమినల్ కేసుల పట్ల న్యాయవాదులకు కావల్సిన సమాచారాన్ని, పార్లమెంట్ రూపొందించిన కొత్త చట్టాల చేర్పిక గురించి అద్భుతంగా బోధించారు. న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న వారికి అవసరమైన జడ్జిమెంట్లు, వాటి గురించి సవివరంగా వివరించారు. అనంతరం ఒక్కరోజుతో పూర్తి చట్టాల గురించి తెలుసుకునే అవకాశం లేదని న్యాయవాదులు కోరడంతో మరోసారి సెమినార్‌ను ఏర్పాటు చేస్తామని బార్ అసోసియేషన్ హామీ ఇచ్చింది. అనంతరం హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ స్వంత ఖర్చులతో కొనుగోలుచేసిన మేజర్ యాక్టు పుస్తకాలను హాజరైన న్యాయవాదులకు అందించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, జిల్లా జడ్జి సురేశ్, నాంపల్లి కోర్టులకు చెందిన జడ్జిలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, ఉపాధ్యక్షులు గోకుల్, కోశాధికారి లడ్డా, సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

మెహిదీపట్నం, అక్టోబర్ 19: ఈ ఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థలో మొబైల్ సర్వీస్ వాహనం, వర్క్‌షాప్‌లో ఎలక్ట్రిషియన్ పనిచేయడానికి అభ్యర్థుల నుంచి నేరుగా దరఖాస్తులను కోరుతున్నట్లు హైదరాబాద్ జిల్లా 108 ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్ ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు ఓ సెట్ జిరాక్స్ కాపీలు తీసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచిస్తున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఆసక్తి గలవారు ఫోన్ నం. 91548 65119లో సంప్రదించాలని కోరుతున్నారు.

గంజాయి విక్రయాలు.. ఐదుగురు అరెస్టు

అబిడ్స్, అక్టోబర్ 19: వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న కేంద్రాలపై ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు దాడిచేసి ఐదుగురిని అరెస్ట్ చేసి, మొత్తం 2.89 కిలోలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ధూల్‌పేట్ బడాబంగ్లా ప్రాంతంలో గంజాయి అమ్మకాలు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్‌టీఎఫ్ టీమ్ సభ్యులు దాడిచేసి సింగ్, రచన బాయి, సంజనబాయిలను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 1.450 కేజీలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు విజయాబాయి పరారీలో ఉన్నాడు. మరో ఘటనలో ధూల్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్న కమలాబాయి, దివ్యసింగ్‌లను అరెస్ట్ చేయగా, దుర్గా దేవి, నేహాబాయి, సంగీత సాహులు పరారీలో ఉండగా, వారినుంచి 1.449 కేజీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ధూల్‌పేట్ ఎక్సైజ్ సీఐలు మధుబాబు, భాస్కర్‌గౌడ్, ఎస్ఐలు మధు, విష్ణుగౌడ్, ఉమా మహేశ్వర్, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి, సుధీర్, అజీమ్‌లు, కానిస్టేబుల్‌లు రాకేశ్, మహేశ్, ప్రభు, రాహుల్, ఖాదార్‌లు పాల్గొన్నారు.